ప్రజాశక్తి
ఆదివారం 25 డిసెంబర్ 2022
5
పార్వతీపురం మన్యం



కాలువలు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పని ట్రాఫిక్ ఎస్ఐ సూర్యారావు, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి పి.కనకారావు అన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా వ్యాపారులు చేసిన ఆక్రమణను మున్సిపల్ సిబ్బంది సహకారంతో శనివారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్టమస్, సంక్రాంతి పండగల నేపథ్యంలో ప్రధాన రహదారిపై కొనుగోలు, అమ్మకందారులతో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని, కావున ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించారు. వీరితో పాటు ప్రజా ఆరోగ్య అధికారి సిహెచ్.మురళి, సచివాలయాల ప్లానింగ్ విభాగం సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక దందా.. సెటిల్‌మెంట్లు

- దోచుకుతింటున్న బొత్స కుటుంబ సభ్యులు
- ఎమ్మెల్యే రౌడీయిజానికి భయపడొద్దు
- మరో ఛాన్సు ఇచ్చి మోసపోవద్దు
- టిడిపి అధికారంలోకి వస్తే అన్ని తరగతులకూ న్యాయం
- విజయనగరం బహిరంగ సభలో నిప్పులు చెరిగిన చంద్రబాబు





జనాలనుద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి/టౌన్,కోట,గజపతినగరం

ఇసుకదందా, సెటిల్‌మెంట్లు, భూకబ్జాలతో విజయనగరం జిల్లాను మంత్రి బొత్స సత్యనారాయణ, ఆయన కుటుంబ సభ్యులు దోచుకుంటున్నారని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు విరుచుకుపడ్డారు. జిల్లాలో ప్రతి పనికీ లంచాలకు పాల్పడటం అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే సెంటు భూమి కోసం రౌడీయిజం చేస్తున్నారన్నారు. వీరి ఆగడాలకు ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. తాను అధికారంలోకి వస్తే అందరికీ అండగా నిలబడతానని భరోసానిచ్చారు. ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా విజయనగరంలోని కోట జంక్షన్‌లో శనివారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రపై రెడ్డి సామాజిక వర్గానికి చెందిన విజయసాయిరెడ్డి, వైవి సుబ్బారెడ్డి పెత్తనం చెలాయిస్తే ఈ ప్రాంతానికి చెందిన మంత్రి బొత్స రోషం లేనివాడిలా వ్యవహరిస్తున్నారని ఎద్దేవాచేశారు. ఈ ప్రాంత బిసిలను రాజకీయంగా మభ్యపెట్టి, ప్రజల్ని లూటీ చేస్తుంటే అచేతనంగా ఊరుకోవడం తగునా? అని ప్రశ్నించారు. తన పాలనలో ఉత్తరాంధ్ర మంత్రుల చేసే పనుల్లో తాను ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని గుర్తుచేశారు. అశోక్ గజపతిరాజు నీతి, నిజాయతీ గల వ్యక్తి అని, ప్రజలకు సేవ చేయడం తప్ప మోసం చేయడం రాదని కితాబిచ్చారు. అటువంటి నాయకుడిపై తప్పుడు కేసులు పెట్టిన వైసిపి ప్రభుత్వం ఏం సాధించిందని ప్రశ్నించారు. రామతీర్థంలో రాముడి శిరస్సు ఖండించినప్పుడు జిల్లాకు రాగానే తనపైనా కేసులు పెట్టారని గుర్తుచేశారు. ఇటువంటి నేతలను తాను తలచుకుంటే బజారులో బట్టలూడదీయగలనని వ్యాఖ్యానించారు. చంపావతి నదిలో ఇసుకను స్థానిక ఎమ్మెల్యే దోపిడీ చేస్తున్నారని, ఇందులోని ముడుపులు జగన్‌కు వెళ్తున్నాయని ఆరోపించారు. జగన్ ప్రభుత్వం మద్యపాన నిషేధం హామీ నెరవేర్చలేదని, బిల్లులు, ఆన్‌లైన్ లావాదేవీలేవీ లేకుండా మద్యం వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. విశాఖపైన ప్రేమలేదని, జగన్ ప్రేమంతా విశాఖలోని భూములు, ప్రజల ఆస్తులు, రుషికొండపైనే అన్నారు. గత ఎన్నికల్లో ఒక్క ఛాన్సు ఇచ్చినందుకు రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కి పోయిందని, ఇలాంటి ప్రభుత్వానికి మళ్లీ అవకాశం కల్పించి మోసపోవద్దని కోరారు.

అడుగడుగునా అపూర్వ స్వాగతం

చంద్రబాబుకు అడుగడుగునా టిడిపి నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. మూడో రోజు బొబ్బిలి కోట నుంచి ప్రారంభమైన చంద్రబాబు రోడ్‌షో రామభద్రపురం, మానాపురం, గజపతినగరం, బొండపల్లి మీదుగా విజయనగరం చేరింది. గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు ఆధ్వర్యాన గజమాలతో చంద్రబాబుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రబాబు కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. తులసివనంలో గంజాయి మొక్కలా ప్రశాంతంగా ఉన్న విజయనగరం జిల్లాలో బొత్స సత్యనారాయణ తయారయ్యారని ధ్వజమెత్తారు. బొత్స సోదరుడు, ఎమ్మెల్యే అప్పలనర్సయ్య బందిపోటులా తయారై, ఇసుక దొంగలా మారి దందా చేస్తున్నారని విమర్శించారు. నేషనల్ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ కౌన్సిల్ ద్వారా నిధులు తీసుకొచ్చి భీమసింగి చక్కెర పరిశ్రమను అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. విజయనగరం నగర పరిధిలోని కెఎల్‌పురం వద్ద టిడిపి శ్రేణులు చంద్రబాబు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి కలెక్టరేట్, బాలాజి మార్కెట్, ఎన్‌సిఎస్ థియేటర్, కన్యకాపరమేశ్వరి ఆలయం, గంటస్థంభం, మూడు లాంగర్ల కూడలి మీదుగా కోట జంక్షన్‌కు చేరుకున్నారు.

వ్యవసాయం, గ్రామాలాభివృద్ధే టిడిపి లక్ష్యం



రైతు సమస్యలపై చంద్రబాబుతో చర్చిస్తున్న బేబినాయన

బొబ్బిలి : టిడిపి అధికారంలోకి వస్తే వ్యవసాయం, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా శనివారం బొబ్బిలికోటలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అధ్యక్షతన రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను చంద్రబాబు దృష్టికి రైతులు, టిడిపి నాయకులు తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూ రీసర్వేతో రైతులకు నష్టమని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్దకే వెళ్లి ధాన్యం కొనే పరిస్థితి లేదన్నారు. వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు మీటర్లు పెట్టడం అన్యాయమన్నారు. టిడిపి రాష్ట్ర కమిటీలో బొబ్బిలి మండలం పారాది మాజీ సర్పంచ్ అల్లాడ భాస్కరరావు, రామభద్రపురం ఉప సర్పంచ్ చింతల రామకృష్ణకు స్థానం కల్పిస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. అనంతరం పట్టణంలోని ఆస్పత్రి రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్‌ను చంద్రబాబు సందర్శించారు. శొండి కులస్తులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి, ఒబిసి జాబితాలో చేర్చాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రత్నాల కాశీవిశ్వనాథ చౌదరి.. చంద్రబాబుకు వినతి అందించారు. బాడంగి మండలం ఎరుకులపాకల్లో ఎరుకుల సామాజిక తరగతి ప్రజలపై వేధింపులు ఆపాలని ఎరుకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పాలవలస గౌరు చంద్రబాబును కోరారు.



సీతానగరం వద్ద రైల్వే బ్రిడ్జిని పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రైల్వే మూడో లైను పనులు వేగవంతం

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - కొమరాడ/సీతానగరం/ పార్వతీపురంటౌన్

విజయనగరం నుంచి రాయపూర్ వరకూ జరుగుతున్న మూడో రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలో రైల్వే మూడో పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా విక్రాంపురం వద్ద అండర్ గ్రౌండ్‌ను పరిశీలించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోటిపాం వద్ద జంఝావతి నదిపై నిర్మించిన మూడో లైనుకు సంబంధించిన కొత్త వంతెనను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులతో మాట్లాడుతూ రైల్వే పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రైల్వే మూడో లైనుకు సంబంధించిన భూసేకరణ చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే కోటిపాం, కొమరాడ గ్రామాల పరిధిలో ఉన్న భూమి రైల్వే శాఖకు అవసరం ఉండడంతో భూసేకరణ సిద్ధం చేయాలని తహశీసిల్దార్‌ను ఆదేశించారు.

రూ.460 కోట్లతో రైల్వే మూడో లైను

విజయనగరం - టిట్లాఘర్ మధ్య నిర్మిస్తున్న రైల్వే మూడో లైను ప్రాజెక్టులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.460 కోట్లుతో పనులను చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. మూడో లైను రైల్వే పనులను ఆర్‌విఎన్ఎల్ సహాయ జనరల్ మేనేజర్ సిహెచ్.విష్ణుమూర్తితో కలిసి కలెక్టర్ సీతానగరం నుంచి కొమరాడ మండలం విక్రంపురం, కోటిపాం, పార్వతీపురం, బెలగాం రైల్వేస్టేషన్ వరకు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడో లైన్ నిర్మాణంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో 44 కిలోమీటర్ల మేర మూడో లైను వస్తుందన్నారు. పార్వతీపురం రైల్వే స్టేషన్ ఫ్రంట్ ఎలివేషన్ స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు పరిగణలోకి తీసుకొని చేపట్టాలని సూచించారు. జిల్లా కేంద్రంలో అన్ని హంగులతో రైల్వే స్టేషన్ ఉండాలన్నారు. మూడో లైను పనులు రావడం వల్ల మరికొన్ని పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు వచ్చే అవకాశం ఉంటుందని కలెక్టర్ అన్నారు. తద్వారా జిల్లాకు రైల్వే కనెక్టివిటీ బాగా పెరుగుతుందన్నారు. సీతానగరం రైల్వే స్టేషన్ పనులు ఫిబ్రవరి నాటికి పూర్తి చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పార్వతీపురం రైల్వే స్టేషన్ ఎలివేషన్ పనులు ఐదు నెలల్లో పూర్తి కాగలవని చెప్పారు.

ఆర్‌విఎన్ఎల్ సహాయ జనరల్ మేనేజర్ సిహెచ్. విష్ణుమూర్తి మాట్లాడుతూ మూడో లైను రైల్వే పనులు పక్కా ప్రణాళికతో చేపడుతున్నట్లు చెప్పారు. ఈ పనులను మన్యం జిల్లాలో చేపట్టకు జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నాయని ఆయన చెప్పారు. విజయనగరం - టిట్లాఘర్ మధ్య నిర్మిస్తున్న రైల్వే మూడవ లైను పనులను 265 కిలో మీటర్లు మేర రూ.2335.68 కోట్లతో చేపడుతున్నామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 44 కిలో మీటర్లు చేపడుతున్నారు. ఇందులో మేజర్ మూడు బ్రిడ్జిలు, ఆరు ఆర్‌యుబిలు, 135 మైనర్ బ్రిడ్జిలు నిర్మాణం జరుగుతుందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో కూనేరు నుంచి సీతానగరం వరకు పనులు చేపడుతుందన్నారు. పార్వతీపురంలో అదనపు కాలినడక వంతెన, బుకింగ్ కార్యాలయం, కూనేరు, గుమడ, పార్వతీపుం, సీతానగరంలో మెరుగైన సౌకర్యాలతో కొత్త స్టేషన్ భవనాలు, రానున్నాయి. కార్యక్రమంలో రైల్వే సీనియర్ డిజిఎం ఇవి గురునాధరావు, తహశీల్దార్లు, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

రూ.787 కోట్లతో జెడ్‌పి అంచనా బడ్జెట్

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత : చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

అన్ని వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇస్తున్నట్లు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. అన్ని శాఖలకు కలిపి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.767.89 కోట్లతో సవరణ బడ్జెట్‌కు, 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.787.02 కోట్లతో అంచనా బడ్జెట్‌కు జెడ్‌పి ఆమోదం తెలిపింది. దీనిలో ప్రత్యేకంగా జిల్లా పరిషత్తు ద్వారా చేసే ఖర్చులకు రూ.13.30 కోట్లతో అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. 34 మండల పరిషత్తు బడ్జెట్లను కూడా సమావేశంలో ఆమోదించారు. శనివారం జెడ్‌పి సమావేశ మందిరంలో చైర్మన్ శ్రీనివాసరావు అధ్యక్షతన జెడ్‌పి బడ్జెట్ సమావేశం, ఒకటో స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. ముందుగా చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జెడ్‌పి బడ్జెట్ నుంచి ఎస్‌సిల సంక్షేమం కోసం 15 శాతం, ఎస్‌టిలకు 6 శాతం, స్త్రీ శిశు సంక్షేమానికి 15 శాతం, అభివృద్ధి పనులకు 23 శాతం, గ్రామీణ మంచినీటి సరఫరాకు 12 శాతం, కార్యాలయ నిర్వహణకు 15 శాతం, వివిధ శాఖల కార్యకలాపాలకు 10 శాతం ఆగంతక ఖర్చులకు 4 శాతం నిధులను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. జలజీవన్ మిషన్ పనులపై సమీక్షిం చారు. త్వరగా టెండర్లు పిలిచి, జెజెఎం పనులను పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. జెడ్‌పి డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్ బడ్జెట్ స్వరూపాన్ని సభకు వివరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జెడ్‌పిటిసి సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కల్యాణమస్తుకు దరఖాస్తు చేసుకోండి

వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలకు అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. జెడ్‌పి బడ్జెట్ సమావేశానం తరం, కల్యాణమస్తు, షాదీతోఫా, పింఛన్ల పంపిణీపై చర్చించారు. జనవరి నుంచి పింఛను రూ.2,750కి పెరుగుతుందని చెప్పారు. డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల గురించి, దరఖాస్తు చేసే విధానం, అర్హతలను వివరించారు. ఈ ఏడాది అక్టోబరు ఒకటో నుంచి జరిగిన వివాహాలకు ఈ పథకాలు వర్తిస్తాయని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.లక్ష, కులాంతర వివాహం చేసుకున్న ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.లక్షా 20వేలు, బిసిలకు రూ.50 వేలు, కులాంతర వివాహం చేసుకున్న బిసిలకు రూ.75 వేలు, ముస్లిములకు రూ.లక్ష, వికలాంగులకు రూ.లక్షా 50వేలు, నిర్మాణ కార్మికులకు రూ.40 వేలు నగదు ప్రోత్సాహకం లభిస్తుందని చెప్పారు. వివాహమైన 60 రోజుల్లోగా ఈ పథకానికి దరఖాస్తు చేయాలని సూచించారు.

జెడ్‌పిలో క్రిస్‌మస్ వేడుకలు

జిల్లా పరిషత్తు ఆవరణలో డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు శనివారం జరిగాయి. చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కేక్ కటింగ్ చేశారు. జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు రమణ

ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న ప్రజానాట్యమండలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రజా సమస్యలపై ప్రజానాట్యమండలి నిరంతరం పనిచేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.రమణ అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో ప్రధానాట్య మండలి కన్వీనింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జానపద ఆటపాటలు నిర్వహించి అంతరించిపోతున్న జానపద కళా రంగాలను ముందుకు తీసుకురావాలన్నారు. విదేశీ హీన సంస్కృతి నుంచి మన సాంప్రదాయ కళలను, కళారూపాలను కాపాడుకుంటూ కళారూపాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈనెల 2న వీధి నాటక ప్రయోక్త కళాతపస్వి సర్దార్ హస్మీ వర్ధంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జరిగే కార్యక్రమాల్లో భాగంగా ఈ జిల్లాలో కూడా ఆయనకు నివాళులర్పిస్తూ కళా ప్రదర్శనలు ప్రదర్శించాలని అన్నారు. వీధి నాటికలను పోరాట ఆయుధంగా మలిచి ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై నాటకాలను తయారుచేసి ప్రదర్శించాలని సమావేశం నిర్ణయించింది. అదేవిధంగా మన సాంప్రదాయ కళలను పరిరక్షించుకొనేలా రేపు సంక్రాంతి సందర్భంగా సాంస్కృతిక ఉత్సవాలు అన్ని మండలాల్లో నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు, ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు, ప్రజానాట్యమండలి కళాకారులు నారాయణస్వామి, రామారావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్


చదువుకొనే దశలోనే విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామెదరరావు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిని లీగల్ లిటరసీ క్లబ్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం కాలంలో పెరిగిన సాంకేతికతను సక్రమంగా ఉపయోగించుకుని విద్యార్థులు చట్టాలపై ఆసక్తిని, అవగాహన పెంచుకోవాలని అన్నారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణ, న్యాయవాదులు టి.జోగారావు, జి.వెంకటరావు సభ్యులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అకుల రాజు, కళాశాల ఉపన్యాసకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : జిల్లా సరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్థానిక భాస్కర ఉన్నత పాఠశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని శని వారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సరఫరాల అధికారి కెవిఎల్ఎన్ మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై ప్రతి ఒక్కరూ సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. కొనుగోలు చేసే ప్రతి వస్తువు బిల్లును పొందాలని సూచించారు. వినియోగదారులు మోసపోకుండా ప్రభుత్వం వినియోగదారుల చట్టాన్ని 1986లో తీసుకువచ్చిందని ఆయన పేర్కొన్నారు. విక్రయ సంస్థలు, తయారీ, సేవా సంస్థల మోసాలను కమిషన్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం పొందవచ్చని సూచించారు. మోసాలకు పాల్పడే వారిపై శిక్ష ఉంటుందని, వినియోగదారులకు తగిన నష్టపరిహారం అందుతుందని చెప్పారు. 2019 వినియోగదారుల చట్టంలో ఇ కామర్స్ లావాదేవీలను చట్టం పరిధిలోకి తీసుకువచ్చారని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బగాది జగన్నాథరావు, డ్రగ్ కంట్రోల్ అధికారి ఎ.లావణ్య, ఆహార తనిఖీ అధికారి పి.వెంకట రమణ, తూనికలు, కొలతల తనిఖీ అధికారి కె.రత్న రాజు తమ శాఖలు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణి చేశారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘం అధ్యక్షులు పెంటపాటి సూర్యారావు, జనరల్ సెక్రటరీ మాన్యం రామకృష్ణ, భాస్కర కళాశాల వ్యవస్థాపకులు భాస్కర రావు, ఆర్. టి.సి డిపో మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న అధికారులు

సాలూరు: వినియోగదారులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పట్టణ వినియోగదారుల మండలి కార్యదర్శి జిల్లెల్ల సీతారాం కోరారు. శనివారం స్థానిక పింఛనుదారుల కార్యాలయంలో జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు చేసే ప్రతి వస్తువు నాణ్యత, ధరలకు సంబంధించిన రసీదులు పొందాలని కోరారు. వినియోగదారుల మండలి అధ్యక్షులు విక్రం సుదర్శనరావు మాట్లాడుతూ వినియోగదారుల్లో చైతన్యం లేనంత కాలం మోసపోతూనే వుంటారని చెప్పారు. ట్రాన్స్‌కో ఎడిఇ జి.శంకరరావును మండలి సభ్యులు సన్మానించారు. శ్రీనివాసా గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి వెంకటరావు గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా వినియోగదారుల మండలి కార్యదర్శి రీనాపాడి,మండలి సభ్యులు రవితేజ,సిఎస్డిటి శంకరరావు పాల్గొన్నారు.



విద్యుత్‌దీపాలతో ముస్తాబైన పార్వతీపురంలోని లూథరన్ చర్చి

విద్యుత్తు కాంతుల్లో చర్చిలు

క్రిస్మస్ నేపథ్యంలో జిల్లాలోని చర్చిలన్నీ విద్యుత్ కాంతులతో మిరిమిట్లు గొలుపుతున్నాయి. చర్చిల్లో వివిధ రకాల అలంకరణలతో ముస్తాబయ్యాయి. శనివారం రాత్రి నుంచి ప్రార్థనలు ప్రారంభమయ్యాయి.

పాలకొండ రూరల్: పట్టణంతో పాటు మండలంలో పలు చర్చిలు ముస్తాబవుతున్నాయి. పాలకొండ పట్టణంలో లూర్ధుమాత దేవాలయం విద్యుత్ కాంతుల్లో మెరిసిపోతూ చూపరులను ఆకట్టుకుంటుంది. శనివారం రాత్రి నుంచి క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. వేలాది మంది భక్తులు వచ్చి ప్రార్థనలు నిర్వహించారు. అలాగే పట్టణంలో గుడ్‌న్యూస్, షారోను, బేతేలు చర్చిలు విద్యుత్ కాంతులతో క్రిస్మస్ వేడుకలకు సిద్ధమయ్యాయి.

పార్వతీపురంటౌన్ : క్రిస్మస్‌కు పట్టణంలో పలు చర్చి ముస్తామయ్యాయి. బెలగాం చర్చివీధిలోని లూథరన్ చర్చి, ఆర్‌సిఎం సెయింట్ జోసెఫ్ చర్చిలతో పాటు పలు చర్చిలు విద్యుత్ కాంతులతో మెరిమెట్లు గెలుపుతున్నాయి. శనివారం రాత్రి క్రైస్తవ భక్తులతో చర్చిలు సందడిగా మారాయి.

పార్వతీపురం రూరల్: క్రిస్మస్‌ను పురస్కరించుకుని మండలంలోని చర్చిలు అందంగా ముస్తాబ నర్సిపురం, వెంకంపేట, ములగ, పెదబొండపల్లి తాళ్లబురిడి, బాలగొడబ, క్రిష్టపల్లి గ్రామాల్లో ఆయా నిర్వాహకులు విద్యుత్ దీపాలం కరణలు చేసి, ఆదివార జరపబోయే ప్రార్థనల కోసం అందంగా అలంకరిస్తున్నారు.

వీరఘట్టం : మండలంలో వివిధ గ్రామాల్లోని చర్చిలు విద్యుత్ దీపాలతో అలరించారు. వీరఘట్టంలో తెలుగు బాప్టిస్ట్ చర్చి, నడుకూరు, తూడి, తలవరం, చలివేంద్రి, బిటివాడ, వండువ తదితర గ్రామాల్లో దేవాలయాలు విద్యుత్తు కాంతులతో అలరించాయి. క్రిస్మస్ వేడుకల్లో ఈనెల 19నుంచి తెలుగు బాప్టిస్ట్ దేవాలయ సంఘ సభ్యులతో మేలుకొలుపులతోనూ, చిన్నారులు, యువత నృత్య ప్రదర్శనలతో పలువుర్ని ఆకట్టుకున్నాయి.

కురుపాం : క్రిస్మస్ వేడుకలు సందర్భంగా స్థానిక గుడ్ సమారిటన్ లూథరన్ చర్చి విద్యుత్ కాంతులతో ముస్తాబైంది. క్రిస్మస్ వేడుకులు ప్రారంభమవ్వడంతో ప్రత్యేక ప్రార్థనలకు అధిక సంఖ్యలో వచ్చిన క్రైస్తవులు విచ్చేశారు.



పాలకొండలో విద్యుత్‌కాంతలతో మిరుమిట్లు గొలుపుతున్న లూర్ధుమాత చర్చి

రైతు భజనలో అధికార, ప్రతిపక్షాలు


ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఏటేటా వ్యవసాయంపై భారాలు మోపుతున్న పార్టీ ఒకటి, అసలు వ్యవసాయమే దండగ అంటూ తన అంతరంగిక ఆలోచనను పుస్తకంలో రాసిన పార్టీ (చంద్రబాబు) మరొకటి. వెరసి రెండూ పార్టీలూ ఇప్పుడు రైతుల భజన చేస్తున్నాయి. అవే మన రాష్ట్రంలోని అధికార, ప్రధాన ప్రతిపక్షాలు. అదేనండీ వైసిపి, టిడిపి. సుదీర్ఘకాలం వ్యవసాయ రంగాన్ని విస్మరించి, సాగునీటి ప్రాజెక్టులకు కనీసం నిధులు కేటాయించని టిడిపి అధినేత, మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడు గడిచిన మూడు రోజులపాటు నిర్వహించిన జిల్లా పర్యటనలో రైతుల గురించి పదేపదే ప్రస్తావించారు. రైతులను గతంలో ఆదుకున్నామని, ఇప్పుడు అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం అధోగతి పాల్జేస్తోందని మొసలి కన్నీరు కార్చారు. వాస్తవానికి టిడిపి హయాంలో సాగునీటి ప్రాజెక్టులకు పెద్దగా నిధులు కేటాయించలేదు. ఆ నిర్లక్ష్యమే జిల్లా వెనుకబాటుకు కారణమంటూ ప్రజాదృక్కోణంగల మేధావులు, రైతులు చెబుతుంటారు. అందుకు తగ్గట్టే చంద్రబాబు మాటలు కూడా ఉన్నాయి. తోటపల్లి సాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిందీ, పూర్తిచేసిందీ తానేనంటూ చంకలు గుద్దుకుంటున్నారు. వాస్తవం చెప్పుకోవాలంటే వైఎస్ఆర్ ప్రభుత్వంలోనే ఎక్కువ నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికీ ఆ ప్రాజెక్టు పనులు పూర్తి కాలేదన్న విషయం పాపం బాబుగారికి తెలియదేమో! దీని సంగతి పక్కనబెడితే అత్యంత నిర్లక్ష్యానికి గురైన రామతీర్థసాగర్ గురించి బాబు ప్రస్తావించేందుకు సంకోచించారు. పెద్దగెడ్డను హడావుడిగా ప్రారంభించినా ఇప్పటికీ



నిర్వాసితులకు న్యాయం జరగలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే సాగు భారం మొదలుకుని, సాగునీటి సమస్యల వరకు ఎన్నో ఇబ్బందులు రైతులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు రైతులను ఉద్ధరిస్తానంటూ ప్రగల్భాలు పలకడంతో నమ్మలేకపోతున్నామని వ్యవసాయ కుటుంబాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

ఇటు తామేమీ తక్కువ కాదన్నట్టుగా వైసిపి నేతలు కూడా రైతుల క్షేమం గురించి మాట్లాడుతున్నారు. చంద్రబాబు డాబులకు ఉలిక్కిపడ్డ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ రైతుల ఉద్ధారకులం తామేనంటూ పల్లవి అందుకున్నారు. ఆయన హయాంలో ఎంతో కొంత రైతాంగానికి మేలు జరిగిన మాట కాదనలేకపోయినప్పటికీ, ఇప్పుడు చెబుతున్నట్టు రైతులేం అంత సుభిక్షంగా లేరు. వ్యవసాయ రంగంలో జరగాల్సినంత అభివృద్ధేమీ జరిగిపోలేదు. రైతుల కష్టాన్ని పెట్టుబడిదారులకు తాకట్టుపెడుతూ పార్లమెంటులో బిల్లుపెట్టిన కేంద్ర ప్రభుత్వానికి వంతపాడుతున్న వైసిపిని ఎలా నమ్మగలం? అని రైతాగం ప్రశ్నిస్తోంది. ఆ మాటకొస్తే ఉచిత వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు పెట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తూచ తప్పకుండా అమలు చేస్తున్నదీ మన జగన్ సర్కారే. దీనిపై చంద్రబాబుచేసిన విమర్శలకు ఉలిక్కపడ్డ మంత్రి బొత్స రైతులు వినియోగిస్తున్న విద్యుత్తును లెక్కించేందుకే మీటర్లు పెడుతున్నామంటూ సమర్థించుకున్నారు. వాస్తవమేమంటే ఉచిత విద్యుత్తుకే ఎసరుపెట్టాలన్న ప్రపంచ బ్యాంకు షరతులవి. అందుకని రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి విషయంలో దొందూ దొందేనని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది.



రైతుకు భూహక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

భూరీసర్వే బృహత్తర కార్యక్రమం : ఎమ్మెల్యే

పాలకొండ : భూరీసర్వే బృహత్తరమైన కార్యక్రమమని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలో భూహక్కు పత్రాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వే వల్ల గ్రామాల్లో అనేక మందికి మేలు చేకూరుతుందన్నారు. రీసర్వేలో కూడా కొన్ని లోపాలున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిని సరిచేయనున్నారు. అలాగే రిజర్వు ఫారెస్టు భూముల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎంఎల్‌సి పి.విక్రాంత్ మాట్లాడుతూ రీసర్వే వల్ల భూతగాదాలకు చెక్ పడుతుందన్నారు. అయితే ఈ రీసర్వే తొందరగా కాకుండా వీలైనంత సమయం తీసుకుని సక్రమంగా చేపట్టాలన్నారు. దీనివల్ల రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ రీసర్వే పక్కాగా చేపట్టడం జరిగిందన్నారు. ఎక్కడైనా లోపాలుంటే మొబైల్ మెజిస్ట్రేట్ ద్వారా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పాలకొండ, వీరఘట్టం తహశీల్దార్లు పి.సోమేశ్వరరావు, మాధవీలత, ఎంపిపి బొమ్మాళి భాను, వైస్ ఎంపిపి కనపాక సూర్యప్రకాష్ తదితరులున్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

రోడ్డు పనులకు శంకుస్థాపన

జియ్యమ్మవలస : మండలంలోని ఖడ్గవలస నుంచి విక్రంపురం వరకు బిటి రహదారి పనులకు స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి శనివారం శంకుస్థాపన చేశారు. రూ.4.30 కోట్లు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. సుమారు 10 కిలోమీటర్ల మేర రహదారి పనులు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, ఎంపిపి ఉరిటి రామారావు తదితరులు పాల్గొన్నారు.



కూనేరు సంతలో నిరసన తెలుపుతున్న గిరిజన సంఘ నాయకులు

బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చొద్దు : సిపిఎం

కొమరాడ : బోయ, వాల్మీకులను ఎస్టీలో చేర్చొద్దని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని కూనేరు సంతలో శనివారం ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేకూర్చరాదంటూ వాటికి సంబంధించిన గోడపత్రికలు సంతలో విడుదల చేశారు. అనంతరం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎపి గిరిజన సంఘ నాయకులు మండంగి ప్రసాద్, బి.దాలయ్య, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ జీవో 52ను రద్దు చేయాలని, జిఒ 3ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్ గ్రామాల్లో చేర్చాలని కోరారు. కార్యక్రమం రాము, లక్ష్మణరావు, చిన్నారావు, సుబ్బారావు, వెంకట్రావు పాల్గొన్నారు.

ఇలా అయితే మురుగునీరు వెళ్లేది ఎలా?

పార్వతీపురం టౌన్: ఇలా అయితే కాలువలో మురుగునీరు వెళ్ళేది ఎలా అని పట్టణంలో 26వ వార్డులో ఉన్న పండా వీధి స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.63.63 కోట్లుతో ఎఐఐబి సహకారంతో పట్టణంలో అన్ని వార్డుల్లో సమగ్రతాగునీరు పథకం ద్వారా పనులు ప్రారంభమైన విషయం తెలిసిందే.. సంబంధిత కాంట్రాక్టర్ కొన్ని రోజులుగా చేపడుతున్న ఈ పనుల్లో పైప్ లైన్లు వేసేందుకు పండా వీధిలో ఉన్న సీసీ రోడ్డును జెసిబి తో తవ్వి పైపులు వేసి గోతులను కప్పే క్రమంలో పెద్ద పెద్ద బండ రాళ్లు మురుగు కాలువలో పడినా వాటిని తొలగించకపోవడంతో మురుగునీరు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్, అధికారులు స్పందించి మురుగునీరు వెళ్ళేందుకు మార్గం సుగమం చేయాలని ఆ వీధి స్థానికుల కోరుతున్నారు.



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న కీర్తన ఫౌండేషన్ సభ్యులు

పేదలకు దుస్తులు పంపిణీ

పాలకొండ రూరల్ : పట్టణంలోని కీర్తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సందర్భంగా క్రిస్మస్ ఈవ్‌ను పురస్కరించుకొని కొండవీధిలో శనివారం పేదలకు అన్న, వస్త్రదానాలు చేశారు. క్రిస్మస్ పర్వదినాన పేదలతో క్రిస్మస్ కేకు కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. సేవా భావానికి నిర్వచనం క్రీస్తు జీవితమేనని పేదలతో క్రిస్మస్ సంబరాలు చేయడం ఆనందంగా ఉందని కీర్తన ఫౌండేషన్ అధ్యక్షులు బత్తిని మోహన్, సభ్యులు లక్ష్మీబాయి, ఎన్.సురేష్, జి.అనిల్, ప్రసాద్, ఇంద్ర, పొట్నూరు రమేష్, దళిత సంఘ సభ్యులు బత్తిన రమణ, మురళి, రాకోటి వెంకటరమణ తదితరులు పాల్గొని దుస్లుఉ పంపిణీ చేశారు. కీర్తన ఫౌండేషన్ సేవలను జిల్లాస్థాయిలో విస్తరించడానికి చర్యలు తీసుకుంటామని, పేద పిల్లల చదువులోనూ, తల్లిదండ్రులు లేని నిరాశ్రయులకు సేవలు అందించడానికి ఫౌండేషన్ ఎప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా తెలిపారు.

గ్రామాల్లో కందికొత్తల సందడి

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో శనివారం కందికొత్తల సందడి మొదలైంది. పిల్లాపాపలతో సహా గ్రామస్తులు గొడ్డలమ్మను పట్టుకొని గ్రామ గ్రామాన ఊరేగిస్తూ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పండగ సందర్భంగా మహిళలు, యువత నృత్యాలు చేస్తూ పలువుర్ని ఆకట్టుకుంటున్నారు. ప్రతి ఏటా సంక్రాంతి ముందు కందికొత్తల ఉత్సవాలను జరుపుకోవడం గిరిజనులకు ఆనవాయితీగా వస్తోంది. పుట్ట జమ్ము, తాడికొండ, గౌడుగూడ, లుంబేసు, ఎల్విన్ పేట గ్రామాల్లో గిరిజనులు గొడ్డలమ్మను ఊరేగింపుగా తీసుకువచ్చారు. కందికొత్తల ఉత్సవాలతో గిరిజన పల్లెలు సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పడుతున్నాయి.



గొడ్డలికి పూజలు చేసి ఊరేగింపు చేస్తున్న గిరిజనులు

పింఛన్లు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ పరిధిలో నిలిపివేస్తామన్న పింఛన్లను పునరుద్ధరించాలని కోరుతూ శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎ.ఆనందరావుకు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యాన బాధితులు వినతిపత్రం అందించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, పాకల సన్యాసిరావు మాట్లాడుతూ వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు ఇతరత్ర వారికి ప్రభుత్వం ప్రతినెలా ఇస్తున్న పింఛన్లలో వాటి అవసరాలు తీరుస్తుకొనేందుకు ఆసరాగా నిలుస్తున్నాయని అన్నారు. ఇప్పుడు జిఒ 274 పేరిట సర్వేల్లో వచ్చిన నివేదిక ప్రకారం నివేశ ఇళ్లు, వెయ్యి చదరపు అడుగుల వైశాల్యం దాటిందని, 300 యూనిట్లు విద్యుత్ వాడుతున్నట్లు, ఆదాయపన్ను కడుతున్నారని, ప్రభుత్వ ఉద్యోగం ఉందన్న నెపంతో పట్టణంలో సుమారు 350 నుంచి 400 మంది పింఛన్లు నిలిపివేస్తున్నట్లు సచివాలయం వాలంటీర్లు నోటీసులు ఇస్తున్నారన్నారు. దీంతో పండగవేళ పింఛన్లు వస్తాయో, రావోనన్న ఆందోళనలో లబ్ధిదారులు ఒత్తిడికిలోనవుతున్నారన్నారు. అర్హులై ఉండి నిరవాస చేసుకోలేని స్థితిలో ఉన్న లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గుడుపూడు కృష్ణ, గెద్ద తులసి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నోటీసులొస్తే పింఛన్లు తొలగించనట్లు కాదు

పార్వతీపురంరూరల్ : నోటీసులు అందుకున్న పింఛనుదార్లు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, అభ్యంతరాలపై సమాధానం ఇస్తే చాలని ఎంపిడిఒ అకిబ్‌జావేద్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా 8వేల పింఛన్లు మంజూరు కాగా, దాదాపు 2500మందికి కొన్ని అభ్యంతరాలపై నోటీసులు సచివాలయాల ద్వారా ఇస్తున్నారని అన్నారు. అయితే నోటీసులు అందుకున్న వారు ఎలాంటి ఆందోళనలు చెందకుండా ఈనెల 29, 30 తేదీల్లో వారి పరిధిలోని సచివాలయాల్లో తగిన సమాధానం ఇస్తే సరిపోతుందని అన్నారు. ఈ క్రమంలో పార్వతీపురం మండలంలో 20 సచివాలయాల పరిధిలో 150 మందికి నోటీసులు పంపిణీ చేస్తున్నామని, వారు ప్రభుత్వం అడిగిన అభ్యంతరాలపై సమాధానం ఇస్తే చాలని తెలిపారు.

ఆగిన పింఛన్లపై అభ్యంతరాలు స్వీకరణ

కురుపాం : నోటీసులు వచ్చిన పింఛనుదారులు ఈనెల 29లోగా సచివాలయం పరిధిలో వెల్ఫేర్ అసిస్టెంట్‌కు నోటీసు ప్రాప్తికి సమాధానాలు అందజేయాలని ఎంపిడిఒ విద్యా శివరామప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పింఛను నిలిపివేయడానికి గల అభ్యంతరాలు ఏవైతే ఉన్నాయో వెల్ఫేర్ అసిస్టెంట్ వద్దకు వెళ్లి అభ్యంతరాలు గడువు తేదీలోగా సమర్పించాలని అన్నారు. లేకుంటే అటువంటి వారి పింఛను నిలిపివేస్తామన్నారు.

సాలూరురూరల్ : మండలంలోని 22 సచివాలయాల పరిధిలోని 38 మంది పింఛనుదారులకు సాంకేతిక సమస్యలు, ఇతరత్రా రకాల కారణాల వల్ల అనర్హులుగా తెలియజేస్తూ నోటీసులు జారీ చేశామని ఎంపిడిఒ జి.పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. కావున నోటీసులు అందుకున్న పింఛనుదారులు సత్వరమే సంబంధిత సచివాలయాల్లో పింఛను పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకొని అర్హులు కావాలని సూచించారు.

పాలకొండ రూరల్: నగర పంచాయతీలోని 9 సచివాలయాల పరిధిలో పెన్షన్ పునః పరిశీలనలో భాగంగా 199 పింఛనుదారులకు నోటీలు జారీ చేశారు. ఇది కేవలం పునః పరిశీలన మాత్రమేనని, పెన్షన్ తొలగింపు చర్య కాదని కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. ఈ విషయమై వెల్ఫేర్ సెక్రటరీలతోను, అడ్మిన్ సెక్రటరీలతోను సమావేశం ఏర్పాటు చేసి, నోటీసులు వచ్చిన పెన్షనర్లు ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రస్తుతం కేవలం వెరిఫికేషన్ మాత్రమే జరుగుతుందని అన్నారు. పెన్షనర్లుకు ఇచ్చిన నోటీసులో వివరాల ప్రాప్తికి సంబంధిత అర్హతను నిర్ధారణ చేసుకుని వివరాలను సచివాలయములలో వెల్ఫే సెక్రటరీలకు సమర్పించాలని తెలిపారు.



ఎఒకు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు



తెలుగుమహాసభలకు హాజరైన కవులు, కళాకారులు

తెలుగు మహాసభకు 60 మంది కవులు హాజరు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రపంచ ఐదో తెలుగు మహాసభల్లో సాహితీ చైతన్యకిరణాలు, బాలకథానిలయం వ్యవస్థాపక అధ్యక్షులు భోగిల ఉమామహేశ్వరరావు (ఉమాకవి) ఆధ్వర్యంలో తెలుగు భాషపై ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరైన 60 మంది కవులతో కవితా సంకలనం పుస్తకం విజయవాడకు చెందిన గండేపల్లి మల్లికార్జునుడు, హైదరాబాద్‌కు చెందిన మోటూరు నారాయణరావు తదితరులు చేతులు మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అమెరికాకు చెందిన డాక్టర్ ఆయ్యల సోమయాజుల ప్రసాద్ శర్మ, పివి దుర్గాప్రసాద్, పాలక దేవానంద్, తెప్పల కృష్ణమూర్తి, వి.రాజారావు, శ్రీకాకుళం గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు, బెహరా ఉమామహేశ్వరరావు, దాలినాయుడు, హైదరాబాద్‌కు చెందిన మోటూరు నారాయణరావు, మీసాల చిన గౌరునాయుడు, రావాడ కృష్ణకుమారి, టి.పార్వతీరావు, డబ్బీరు వెంకటకృష్ణ (శరత్ కవి) తదితరులు పాల్గొన్నారు. అలాగే ఫ్రెంచ్ దేశస్థులు, ఆచార్య డేవిడ్ డానియల్ కూడా పుస్తకాన్ని తీసుకుని చదివి ఉమాకవిని అభినందించారు.

పూర్తి స్థాయిలో కార్యాచరణ

ప్రజాశక్తి - కొమరాడ

గ్రామాల్లో పూర్తి స్థాయిలో జరిగేలా కార్యాచరణ చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. శనివారం స్థానిక పిహెచ్‌సిని ఆయన సందర్శించారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య కార్యక్రమం గ్రామాల్లో పూర్తి స్థాయిలో జరిగేలా కార్యాచరణ చేయాలని, అందుకు ఖచ్చితమైన ప్రణాళికను వేసి సిబ్బందికి నిర్దేశించిన విధి నిర్వహణలను ఎప్పటికప్పుడు వైద్యాధికారి పర్యవేక్షణ చేయాలని సూచించారు. అలాగే సచివాలయాల వారీగా ఆరోగ్య కార్యక్రమాలపై నివేదికలను ఎప్పటికప్పుడు పరిశీలించి పురోగతి అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్థానిక గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. సీజనల్‌గా వచ్చే, ఇతర వ్యాధులపై అవగాన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శిరీష, ప్రిన్సిపల్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతోనే వ్యాధుల నివారణ

హేండ్ వాష్ స్టేషన్‌ను ప్రారంభించిన డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

ప్రతిరోజూ చేతులు శుభ్రంగా కడుక్కోకపోతే అనేక అంటువ్యాధులు వస్తాయని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నీరు, పారిశుధ్యం పరిశుభ్రత (వాష్) కార్యక్రమంలో భాగంగా యునిసెఫ్ సహకారంతో మంజూరైన హేండ్ వాష్ ట్యాంక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చేతులతో రోజూ చాలా పనులు చేస్తుంటామని, అందుకే శుభ్రం చేసుకోవాల్సిన అవసరం వుందని చెప్పారు. అలా చేసుకోకపోతే వ్యాధులొస్తాయని చెప్పారు. గత రెండేళ్లుగా కరోనా వైరస్‌తో మానవాళి ఎంత ఇబ్బంది పడిందో కళ్లారా చూశామని చెప్పారు. ఇంకా కరోనా వైరస్ ముప్పు పూర్తిగా తొలగిపోలేదన్నారు. అప్రమత్తంగా ఉండడమే ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత చాలా అవసరమని చెప్పారు. మెప్మా ఆధ్వర్యాన పనిచేస్తున్న మహిళా సంఘాలు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి ఇంట్లో మహిళ శుభ్రతపై అవగాహన కలిగి వుంటే అందరూ వున్నట్లేనని చెప్పారు. కార్యక్రమంలో నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, పట్టణ వైసిపి అధ్యక్షులు జర్జాపు సూరిబాబు, కౌన్సిలర్లు గిరిరఘు, వైసిపి నాయకులు పి.ఆప్పలస్వామి, మహిళా అధ్యక్షులు రాంబాయి, కమిషనర్ హెచ్ శంకరరావు, మెప్మా సిఎంఎం ఎ.పుష్ప , యునిసెఫ్ ఫెసిలిటేటర్ కనక రత్నం పాల్గొన్నారు.



హేండ్‌వాష్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

చంద్రబాబు మాటలు అబద్ధాలు : బొత్స

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు వ్యాఖ్యలు.. అబద్ధాలు, అభూత కల్పనలేనని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కొట్టిపారేశారు. టిడిపికి జవసత్వాలు లేవని, వాటికి ఊపిరిపోసి నిలబెట్టుకునేందుకు బాబు పాకులాడుతున్నారని వ్యాఖ్యానించారు. శనివారం నగరంలో గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో చంద్రబాబు జిల్లా పర్యటన, ఆయన చేసిన విమర్శలపై బొత్స మాట్లాడారు. చంద్రబాబు ఇప్పటికైనా సోది కబుర్లు మానేసి, ఆయన హయాంలో జిల్లాకు ఏం చేశారో చెపితే బాగుంటుందని హితవుపలికారు. రాజాం, బొబ్బిలి సభల్లో ఒక్క మాట కూడా నిజం చెప్పలేదన్నారు. వ్యవసాయ రంగాన్ని, రైతులను నిండా ముంచింది చంద్రబాబేనన్నారు. ఒకప్పుడు చంద్రబాబు రాసిన మనసులో మాట పుస్తకంలో 'వ్యవసాయం దండగ' అంటూ పేర్కొన్నారని గుర్తుచేశారు. తోటపల్లి ప్రాజెక్టును నిర్మించిందీ తామేనన్నారు. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు కక్ష సాధింపు చర్య వల్ల గడిచిన మూడున్నరేళ్ల వరకు రామతీర్థసాగర్ పనులు ముందుకు సాగలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక రీ టెండర్లు వేసి, పనులు ముమ్మరం చేశామన్నారు. బొబ్బిలి సుగర్ ఫ్యాక్టరీని ప్రయివేట్ వ్యక్తులకు అమ్మింది చంద్రబాబేనన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణ పనులు

ప్రజాశక్తి - సీతానగరం

జగనన్న లేఔట్‌లో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఎంపిడిఒ బి.కృష్ణ మహేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అప్పయ్యపేట, జోగిపేట గ్రామాల్లో శనివారం జగనన్న లేఔట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు కావాల్సిన సహాయ సహకారాలు ప్రభుత్వం ద్వారా అందిస్తామన్నారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా సిబ్బంది పనిచేయాలన్నారు. అలాగే ఎంపిటిసి సభ్యులు బురిడి కుసుమ సూర్యనారాయణ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. లబ్ధిదారులు వారికి కావాల్సిన సిమెంట్, ఇనుము వారికి అందిస్తామన్నారు. అలాగే ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, హౌసింగ్ ఎఇ జానకీరాం, ఎఎంఒ ఎం.సింహాచలం, ఇఒ జి.వెంకటరమణ, వర్క్ఇన్‌స్పెక్టర్ కృష్ణ, జోగిపేట, పెదబోగిలి సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సీతంపేట : పిఎంఎవై పథకం ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ఎంపిడిఒ కె.గీతాంజలి అన్నారు. శనివారం కేసరిజోడు పంచాయతీలో ఇళ్లకు సంబంధించిన స్థల సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ఆర్ కల్యాణమస్తు సాధి తోప పథకాలు గురించి అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కలువరాయిలో నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం హడ్డుబంగి సచివాలయాన్ని సందర్శించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సున్నాపురం రవి, హౌసింగ్ ఎఇ వెంకటేష్, ఆర్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ మహేష్‌రెడ్డి

మండలాన్ని అభివృద్ధి పథంలో నడపాలి : ఎంపిపి

ప్రజాశక్తి - కొమరాడ

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిపి శెట్టి శ్యామల అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలో మూడు నెలలుగా జరిగిన అభివృద్ధి నివేదికలను వివిధ శాఖల వారీగా చదివి వినిపించారు. రెవెన్యూ శాఖ ద్వారా జరుగుతున్న పలు వివరాలను ఆర్ఐ ఎస్.శ్రీనివాసు వివరించారు. మండలంలో 17 గ్రామాల్లో రీ సర్వే జరుగుతుందన్నారు. 1167 మందికి ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేసి వారికి రైతు భరోసా కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ఎంఇఒ శంకరరావు మాట్లాడుతూ మండలంలో 12చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎప్పటికి సుమారుగా 560 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం రవాణా నిమిత్తం 408 ట్రాక్టర్లకు రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. 60 వేల గోనెసంచులు అందజేశామని, ఇంకా 25వేలు అవసరం ఉందన్నారు. ఇతర శాఖ అధికారులు తమ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో జడ్పిటిసి సభ్యులు ద్వారపూడి లక్ష్మి, వైస్ ఎంపిపి నంగిరెడ్డి శరత్‌బాబు, ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావు, సొసైటీ చైర్మన్లు సూరపునాయుడు, శ్రీధర్, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐ శ్రీనివాస్, పక్కన ఎంపిపి, జెడ్‌పిటిసి

జనసేన ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని బర్లిలో జనసేన ఆధ్వర్యాన జాతీయ రైతు దినోత్సవ వేడుకలు శనివారం ఆ పార్టీ మండల అధ్యక్షులు బంకురు పోలినాయుడు, మండల నాయకులు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా పలువురు రైతులకు శాలువాలతో చిరు సత్కారం చేశారు. అనంతరం జనసేన రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు మాట్లాడుతూ 2024లో రాబోయేది రైతు ప్రభుత్వమేనని, పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రిగా రైతాంగానికి పెద్ద పీట వేస్తారని, ఇప్పుడు పడుతున్న కష్టాలన్నింటినీ పరిష్కరించి తీరుతారని అన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతు కుటుంబాలకు పవన్ కల్యాణ్ అండగా నిలుస్తున్నారన్నారు. కావున రైతులంతా పవన్ కల్యాణ్‌కు సంపూర్ణంగా అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు గంట్యాడ స్వామి నాయుడు, రగుమండ అప్పలనాయుడు, పరుచూరి రమణ, ఆది, ప్రగడ కల్యాణ్, శ్రీను, పాలూరు వెంకటేష్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆవుకు చికిత్స చేయిస్తున్న అంధవరపు కోటేశ్వరరావు

మూగజీవులకు అండగా అంధవరపు

ప్రజాశక్తి - కురుపాం

కరోనా సమయంలో ఆయన సేవలను మరవలేనివి. మనిషికి ఏ కష్టమొచ్చినా వెంటనే నేనున్నానంటూ స్పందించే వ్యక్తి. కష్టం వచ్చిన వ్యక్తి వద్దకు వెళ్లి సేవలందించడమే ఆయన లక్ష్యం. అది ఇంత వరకు ఒక ఎత్తయితే ఇప్పుడు ఆ సేవలు కేవలం మానవులకే కాదు మూగజీవులు కూడా సేవలందించడంలో నేనున్నానంటున్నరు కలింగవైశ్య జిల్లా అధ్యక్షులు, మాజీ జడ్పిటిసి సభ్యులు అంధవరపు కోటేశ్వరరావు. శనివారం ఒక మూగ జీవి గుంతలో పడి ఒడ్డుకు రావడానికి ప్రయత్నిస్తూ ఒళ్లంతా దెబ్బలు తగిలాయి. దీంతో ఆయన వెంటనే వైద్య సిబ్బందిని తీసుకువెళ్లి మూగ జీవికి వైద్యం చేయించి, ఒడ్డుపైకి తీసుకొచ్చారు. మూగజీవికి సేవ చేసి మానవత్వం చాటుకున్నారు. ఆయన సేవలకు పలువురు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన గడ్డికుప్పలు

గడ్డికుప్పలు దగ్ధం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక శోభాలతాదేవి కాలనీలో శనివారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో వరి గడ్డికుప్పలు దగ్ధమయ్యాయి. విద్యుత్తుశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని కల్లాంలో వేలాడుతున్న విద్యుత్తు వైర్లలను తాత్కాలికంగా సరిచేసి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఇక్కడే మూడుసార్లు ధాన్యంతో ఉన్న వరికుప్పలు, పశువుల పాక కాలిపోయియాయి. అయినా ఇప్పటికీ విద్యుత్‌శాఖ అధికారులు వేలాడుతున్న విద్యుత్తు తీగలను, సమీపంలో ఒరిగిన స్తంభాన్ని మార్చకపోవడంతో మళ్లీ విద్యుత్తు తీగలు కలిసిపోయి మంటలు ఏర్పడి అగ్ని ప్రమాదం జరిగిందని బాధిత రైతులు వాపోతున్నారు. దీనిపై కురుపాం మండల ఇన్చార్జి విద్యుత్తు శాఖ ఎఇ త్రినాధరావు వద్ద ప్రస్తావించగా త్వరలో ఒరిగిన విద్యుత్తు స్తంభం స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి, కల్లాంలో వేలాడుతున్న విద్యుత్తు తీగలను సరిచేయిస్తామన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

కురుపాం : స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్రిన్సిపల్ ఎస్. సత్యనారాయణ ఆధ్వర్యంలో ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ కార్యక్రమం ముఖ్య అతిథిగా ఎంఇఒ ఎన్.సత్యనారాయణ హాజరై విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రభుత్వ పాఠశాలలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సక్రమంగా చదువుకొని ప్రభుత్వ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె.భూషణ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు లేప్‌టాప్‌లు అందజేస్తున్న ప్రిన్సిపల్, ఎంఇఒ